క్లుప్తంగా

విధుల నుంచి తొలగించండంటూ ధర్నా

కాకినాడ సిటీ: ఉత్తరాంధ్ర, రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఎస్సీఈఆర్టీ కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్, ఆంధ్రాయూనివర్సిటీ వీసీలను విధుల నుంచి తొలగించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాకినాడ బాలాజీ చెరువు సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.గంగా సూరిబాబు, కృప, మహి, జాను, రాజేష్, రాజ్‌కుమార్, ప్రణయ్, అజయ్ పాల్గొన్నారు.

వార్డులో పర్యటన

బాలాజీచెరువు: మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి ముత్తాశశిధర్ పేర్కొన్నారు. మన ప్రాంతం-మన సచివాలయంలో భాగంగా 25వ వార్డులో కుందూరి వెంకట్రావు, పద్మ ఆధ్వర్యంలో పర్యటించారు. వేటపై ఆధారపడి జీవించేవారి బతుకులు అగమ్యగోచరంగా ఉన్నాయన్నారు.

దోమల నివారణకు చర్యలు



యాంటీలార్వా మందును చల్లుతున్న ఏఎన్ఎం

కరప: గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కరప, అరట్లకట్ట, వాకాడ గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి, గ్రామకార్యదర్శులకు సూచనలు చేశారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. డ్రెయిన్లలో, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి, దోమలు వ్యాప్తి చెందకుండా, ఎబేటు మందును పిచికారీ చేయించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. గ్రామకార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎంలతో కల్సి దోమలమందు పిచికారీ చేయించారు. ఏఎన్ఎంలు గృహాల వారీగా సర్వే జరిపి, జ్వరం కేసులను నమోదుచేసి, యాంటీ లార్వా మందును చల్లారు. కార్యదర్శులు వి.సునీల్‌కుమార్, శ్రీనివాస్, పి.వీరభద్రరావు, ఎస్. ఉషాకుమారి పాల్గొన్నారు.

అన్నదానం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన మహాఅన్నదాన కార్యక్రమాన్ని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ప్రారంభించారు. దాతల సహకారంతో సుమారు మూడు వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి, ఈటరాపర్తి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం జెడ్.భావారంలో సోమవారం కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించి, ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి చాటుకున్న సీఎం జగన్

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు

కాకినాడ: మాదిగలకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించడం ద్వారా ముఖ్యమంత్రి ఎస్ జగన్మోహన్‌రెడ్డి తన చిత్తశుద్ధిని చాటుకున్నారని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లా నుంచి ఎమ్మెల్సీ స్థానం మాదిగ వర్గానికి కేటాయించడం హర్షదాయకమన్నారు. ఇందుకు సీఎంకు జిల్లా సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం జరిగే నామినేషన్ ప్రక్రియకు ఉమ్మడి జిల్లా నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. నేతలు పలివెల రవి అనంతకుమార్, గొడత విజయ్‌కుమార్, జిత్తుక బాబురావు, బోడపాటి చంటి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద ఫ్లడ్‌లైట్ల చోరీ

కరప: మండలంలోని కరప, పెనుగుదురు గ్రామాల మధ్య నిర్మించిన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంవద్ద అమర్చిన రెండు ఫ్లడ్‌లైట్లు చోరీకి గురయ్యాయి. కాకినాడ, రావులపాలెం ప్రధాన రహదారిలో కరప సమీపంలో చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు 51 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని నిర్మించి, గతేడాది నవంబర్ 29వ తేదీన ఆవిష్కరించారు. స్వామివారు రాత్రిసమయంలో కూడా కనిపించే విధంగా రూ.25 వేలు విలువచేసే రెండు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి దుండగులు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంవద్ద ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లను దొంగిలించుకుపోయారు. చిక్కాల దొరబాబు సోదరులు సోమవారం కరప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు.

అధరేటి కవరింగ్!

- సెల్‌ఫోన్ కవర్స్‌కు పెరుగుతున్న డిమాండ్
- రూ.5 వేల వరకు పలుకుతున్న రేటు
- డిజైన్లపై మక్కువ చూపుతున్న యువత, మహిళలు

బోట్‌క్లబ్: సెల్‌ఫోన్ పాడవకుండా వాడే కవర్లకు డిమాండ్ ఎక్కువగానే ఉంటోంది. కొందరు సెల్‌ఫోన్ కంటే కవర్లు అందంగా ఉండేవి ఎంచుకొంటున్నారు అంటే అతిశయోక్తి కాదు. అందానికే కాక సెల్‌ఫోన్‌కు రక్షణగా కూడా ఇవి ఉపయోగిస్తున్నాయి. ప్రస్తుతం రూ.100 నుంచి రూ.5 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ కవర్స్ మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి అంటే వాటికి ఉన్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. సెల్‌ఫోన్‌తోపాటు దాదాపు అన్ని కంపెనీలు దానికి కావాల్సిన కవర్స్ ఇస్తున్నాయి. వాటితో ఇచ్చే కవర్ల ధర రూ.100 నుంచి 300 లోపు ఉంటుంది. కానీ యువత పాత



మహిళలు ఇష్టపడే వివిధ రకాల డిజైన్ సెల్‌ఫోన్ కవర్స్

మోడల్‌తో ఉన్న కవర్స్ వేసుకొనేందుకు ఇష్టపడడం లేదు. వివిధ రకాల డిజైన్లవి వేసుకొనేందుకు అధికంగా ఇష్టపడుతున్నారు. ఒక సెల్‌ఫోన్ దాదాపు రెండు, మూడు సంవత్సరాలు వినియోగిస్తారు. దానికి మాత్రం ఐదారునెలలకు ఒక కవర్ చొప్పున వేస్తున్నారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులు వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. కాకినాడ నగరంలోనూ సుమారు 200కిపైగా సెల్‌ఫోన్లు, కవర్లు విక్రయించే షాపులు ఉన్నాయి. భానుగుడి, మెయిన్‌రోడ్డు, తిలక్ స్ట్రీట్, దేవాలయంవీధి వంటి ప్రధాన కూడళ్లలో ఉన్న ఒక్కొక్క షాపులోను ప్రతీ రోజు 100కిపైగా సెల్‌ఫోన్ కవర్లు విక్రయిస్తున్నారు. పెద్ద వయసు వారు సెల్‌ఫోన్ రక్షణ కోసం ఎక్కువ మందం ఉన్న కవర్స్ కొనుగోలు చేస్తుంటే యువత మాత్రం లుక్ అందంగా ఉండే కవర్స్‌పైనే మక్కువ చూపుతున్నారు.

డిజైన్ కవర్లదే హవా

డిజైన్ ఉన్న కవర్లను చాలామంది ఇష్టపడుతున్నారు. వీటి రేటు కూడా ఎక్కువగా ఉంది. రూ.ఐదు వేలు పై బడి ధర పలికే కవర్స్ మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. దాదాపు అన్ని ఆన్‌లైన్ షాపింగ్ సైట్లలోను డిజైన్ ఉన్న కవర్లు కొనేవారి సంఖ్య ఎక్కువగా ఉంది.



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల సెల్‌ఫోన్ కవర్స్

మహిళలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు



మహిళలు సాధారణ సెల్‌ఫోన్ కవర్స్ అంటే ఇష్టపడడం లేదు. మిక్కీమౌస్ తోపాటు వివిధ రకాల డిజైన్లు ఉన్న కవర్స్ అంటే ఇష్టపడుతున్నారు. కవర్ కొద్దిగా మాసిపోయినా కొత్తది కొంటున్నారు. డిజైన్ కవర్స్ కొనుగోలు చేసేవారిలో మహిళలే అధికంగా ఉంటున్నారు. మా షాపులో ప్రతీ రోజు 30 నుంచి 40 మంది మహిళలు సెల్‌ఫోన్ కవర్లు కొనుగోలు చేస్తారు.

– ఆకుల రాజా, బిగ్‌ఏ మొబైల్‌షాపు యజమాని

కవరే అందరికీ కనిపిస్తుంది



సెల్‌ఫోన్ ఎంతపెట్టి కొన్నా అది బయటకు కనిపించదు. అందుకే కలర్ ఫుల్ సెల్‌ఫోన్ కవర్స్‌ను వాడుతున్నాను. ఒకసారి వాడిన మోడల్ మళ్లీ వాడకుండా కొత్త మోడల్ కోసం షాపునకు వస్తుంటాను. సంవత్సరానికి మూడు, నాలుగు కవర్స్ మార్చుతాను.

– మత్సా దుర్గా



రేపటి నుంచి వైజ్ఞానిక ప్రదర్శన



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న డీఈవో అన్నపూర్ణ తదితరులు

కాకినాడ సిటీ: ఈ నెల 22, 23 తేదీల్లో ఏఎంజీ ఉన్నత పాఠశాలలో జరగనున్న కాకినాడ జిల్లా స్థాయి సైన్సు ఎగ్జిబిషన్ జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ కోరారు. సోమవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సైన్సు ఫేర్‌లో 21 మండలాల నుంచి ఎంపికైన 105 ప్రాజెక్టులు ప్రదర్శిస్తామన్నారు. ఈ ప్రదర్శన నుంచి 10 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు డీఈవో అన్నపూర్ణ తెలిపారు. కాకినాడ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, జిల్లా సైన్సు అధికారి ఎం. శ్రీనివాస్‌వినీల్, అసిస్టెంట్ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్, ఎస్ఎస్ఏఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు, జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాల్ట్ భూములు పరిశీలించిన ఆర్డీఓ రమణ

కరప: మండలం పెనుగుదురులో నిరుపయోగంగా ఉన్న సాల్ట్ భూములను సోమవారం కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ కృత్తికా శుక్లా ఆదేశాల మేరకు పెనుగుదురులో సాల్ట్ భూములు పరిశీలించామన్నారు. ఇక్కడ 42 ఎకరాలు నిరుపయోగంగా ఉన్నట్టు గుర్తించామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అవి ఏ మేర ఉపయోగపడతాయో పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ రమణ తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ఈ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచరావు, వీఆర్వో పి.ఆదినారాయణ పాల్గొన్నారు.



పెనుగుదురులో సాల్ట్ భూములు పరిశీలిస్తున్న అధికారులు

పదవులకు ఎంపికలో సామాజిక సమతూకం

- కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి దీప్తికుమార్
- వైఎస్సార్ సీపీలో శ్రేణుల సంబరాలు

కాకినాడ: పదవులకు ఎంపికలో సామాజిక సమతూకాన్ని పాటిస్తానన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో కూడా అమలు చేసి చూపించారని కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పేర్కొన్నారు. వాడబలిజ మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన కర్రి పద్మశ్రీని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఎమ్మెల్సీ పదవుల్లో కూడా సముచిత ప్రాధాన్యం దక్కిందని, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో మత్స్యకార వర్గానికి చెందిన పద్మశ్రీని ఎమ్మెల్సీ పదవి వరించిందన్నారు. పార్టీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ గతంలో అగ్నికుల క్షత్రియ వర్గానికి చెందిన బందన హరికి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవితోపాటు వాడబలిజ వర్గానికి చెందిన చోడిపల్లి సత్యప్రసాద్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇప్పించడం ద్వారా ఎమ్మెల్యే ద్వారంపూడి మత్స్యకారులలోని రెండు ప్రధాన వర్గాలకు న్యాయం చేశారన్నారు. ఇప్పుడు వాడబలిజ వర్గానికి చెందిన మహిళకు ఎమ్మెల్సీ ఇవ్వడం ద్వారా మున్నెన్నడూ లేనంత ప్రాధాన్యం ఇచ్చినట్లయ్యిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, కాకినాడ జిల్లా బీసీసెల్ కార్యదర్శి బెజవాడ బాబి, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి ఇరుసుమళ్ల విష్ణు, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి తొంపల తాతారావు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి దీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న తదితరులు

నిత్యావసర సరకుల పంపిణీ



సరకుల పంపిణీ కార్యక్రమంలో మీ కోసం సంస్థ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు సోమవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు పిల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి అండగా వారి ఇళ్లకు వెళ్లి తమ వంతు సహాయం చేస్తున్నామన్నారు. దంత వైద్యుడు సువర్ణరాజు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకులు సమాజ సేవ కోసం స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి సేవలు చేయడం అభినందనీయమన్నారు. అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, రాఘవరావు, రేలంగి బాపిరాజు, శివ, రాజు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకం ప్రయోగశాల ప్రారంభం

బాలాజీచెరువు: పీఆర్ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టిష్యూ కల్చర్ ల్యాబ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ కోర్సులే గాకుండా ఉపాధి కలిగించే కోర్సులు పుట్టగొడుగులు పెంపకం వంటి వినూత్నమైన సిలబస్ రూపొందించి అమలు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఏలియా, వృక్షశాస్త్ర విభాగాధిపతి శామ్యూల్ పాల్గొన్నారు.

నిరుద్యోగులను ఆదుకోవాలి

బాలాజీచెరువు: గ్రంథాలయ శాస్త్రంలో పీహెచ్‌డీలు సైతం చేసిన వారు ఉన్నారని, వారికి ఉద్యోగాలు కల్పించాలని గోదావరి లైబ్రేరీ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సాయిబాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అన్ని విభాగాల్లో విద్యాసంస్థలు, గ్రంథాలయాలు తదితర వాటిలో ఉద్యోగాలు భర్తీ చేయాలని, ముఖ్యంగా జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉద్యోగాలకు న్యాయస్థానం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు.

ముఖ్యమంత్రి బీసీల పక్షపాతిగా మరోసారి నిరూపణ

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని అయ్యరక కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ అన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడమే కాకుండా కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్లను నియమించారన్నారు. రాష్ట్రంలోని 18 ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి 11 స్థానాలు బీసీ అభ్యర్థులకు కేటాయించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఇది ప్రథమమని అన్నారు.

విచారణ జరపాలి

పెద్దాపురం: స్థానిక పట్టాభి ఆగ్రోఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్మికుడు రాజు మృతిపై విచారణ జరపాలని సీఐటీయూ పెద్దాపురం మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్ ప్రకటనలో డిమాండ్ చేశారు.

సామాజిక న్యాయమే న్యాయస్థానాల లక్ష్యం

కాకినాడ రూరల్: సామాజిక న్యాయమే న్యాయస్థానాల లక్ష్యమని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శేషాద్రినగర్‌లో అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో రామం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాజంలో నెలకొన్న సాంఘిక అసమానతలను తొలగించడానికి న్యాయస్థానాలు కృషి చేస్తాయన్నారు. పేదరిక నిర్మూలన, ఉపాధి, లింగ సమానత్వం, సామాజిక శ్రేయస్సు అందరికి న్యాయం చేయడానికి ఏటా ఫిబ్రవరి 20న ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి పిలుపు ఇచ్చిందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది రామం

అలరించిన క్యాంప్ ఫైర్

నాగమల్లితోట జంక్షన్: జాతీయ సీనియర్స్ హాకీ పోటీలలో భాగంగా సోమవారం రాత్రి కాకినాడ జిల్లా క్రీడామైదానంలో క్యాంప్ ఫైర్‌ను నిర్వహించారు. హాకీ టోర్నీ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అసంతా లాత్రా క్యాంప్ ఫైర్‌ను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు తమ సంప్రదాయ నృత్యాలతో అలరించారు. పంజాబ్, హర్యానా, తెలంగాణ, ఏపీ, బిహార్, కేరళ, ఒడిశా క్రీడాకారిణులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ క్యాంప్ ఫైర్‌లో కోచ్‌లు, మేనేజర్‌లు, క్రీడాకారులు ఉత్సాహంగా గడిపారు. ఈ క్యాంప్ ఫైర్‌లో హాకీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ రవిరాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్ తిలకించారు.



నృత్యాలు చేస్తున్న క్రీడాకారిణులు

తక్షణ పరిష్కారానికే 'స్పందన'



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఏడీసీ మాట్లాడుతూ మంచినీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, ఆక్రమణలు వంటి స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతీ ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ఆర్థిక పరమైన అంశాలు, న్యాయపరమైన వివాదాలకు సంబంధించిన అంశాలు తప్ప ప్రతీ ఒక్క సమస్యను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి ప్రభుత్వం కూడా ప్రత్యేక ప్రాధాన్యమిస్తుందని, అందువల్ల ప్రజాఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఏడీసీ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బ్రాండెడ్ దుస్తుల మార్కెటింగ్ పేరిట టోపీ

- జేసీ, సర్పవరం పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వెల్లడించిన సీఐ



సీఐ మురళీకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కాకినాడ రూరల్: బ్రాండెడ్ దుస్తుల మార్కెటింగ్‌లో ఉపాధి కల్పిస్తామని ఆశ చూపి సొమ్ము చేసుకుని ఒక మల్టీ ట్రేడ్ ప్రైవేట్ కంపెనీ తమను మోసగించిందని బాధితులు ఫిర్యాదు చేశారు. వాకలపూడి గ్రామంలో లైఫ్ టైమ్ విజన్ (ఎల్‌టీవీ) మల్టీ ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమను మోసం చేసిందని బాధితులు జాయింట్ కలెక్టరు ఇలక్కియా, సర్పవరం పోలీసులను సోమవారం ఆశ్రయించారు. ఆ సంస్థ చట్టబద్ధమైనదిగా నమ్మించి దుస్తులను మార్కెటింగ్ చేయాలని ఆకర్షించిందని పేర్కొన్నారు. తరువాత రెండు స్కీమ్‌లు చెప్పి భవిష్యత్ ఆదాయం ఎర చూపడంతో రూ.46,362 చొప్పున చెల్లించామని బాధితులు టి.భవాని భాగ్యలక్ష్మి, స్మైలీ ప్రియంకా, రోజీ, నాగార్జున కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు ఏడు జతల బ్రాండెడ్ దుస్తులు ఇస్తామని, ఇదే స్కీమ్‌లో ఇతరులను గొలుసు కట్టుగా చేర్పిస్తే రూ.8వేలు చెల్లిస్తామని ఆశ చూపారన్నారు. మరో స్కీమ్‌గా రూ.9,263 చెల్లిస్తే మూడు జతల దుస్తులతో పాటు ఈ స్కీమ్‌లో చేర్పించిన వారికి రూ.720 ఆశ చూపారన్నారు. తాము చెల్లించిన సొమ్ముకు దుస్తులు ఇవ్వకుండా సంస్థ మోసం చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేసి, న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు మేరకు సర్పవరం సీఐను విచారణ నిర్వహించి కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. సోమవారం రాత్రి బాధితులు సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులను వివరాలు సేకరించిన సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: మాఘ అమావాస్యను పురస్కరించుకుని సోమవారం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు గంగాధరబట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, వ్రతపురోహితులు చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. స్థానిక ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ, 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ఘనంగా అరుణ హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూర్య భగవానుడికి సోమవారం అరుణహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మాఘ మాసంలో ప్రత్యేక పూజలు చేయించుకున్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.